విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్

విశాలాంధ్ర - నిడమర్రు: జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో రవికుమార్ అన్నారు. బుధవారం నిడమర్రు మండలంలోని పెదనింద్ర కొలను, అడవికొలను గ్రామలలో ధాన్యం కొనుగోలు కేంద్రమును రవికుమార్ సందర్శించారు. రైతులతో చర్చించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. నిడమర్రు మండలానికి ప్రోక్రాస్మెంట్ టార్గెట్ క్రింద 16,986 మెట్రిక్ టన్నులు ఇవ్వగా నేటి వరకు 11,082 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని ఆయన అన్నారు. మిగిలిన టార్గెట్ ఈనెల 6 తేదీ శనివారం లోపు పూర్తిచేయాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు.తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహాశీల్దార్ బి. సాయిరాజ్, ఎంపీడీవో పివివి ప్రకాష్, వ్యవసాయ అధికారి బిస్సీ బాబు, రెవెన్యూ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఐదుగురి అరెస్ట్

విశాలాంధ్ర-టి.నరసాపురం: పోక్సో కేసులో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికీ చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రేమిస్తున్నాను అని వెంటపడి ఏప్రిల్ 29వ తేదిన కిడ్నాప్ చేసి ఆమెను అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన నలుగురు వ్యక్తులపై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు టి నరసాపురం ఎస్ఐ ఐదుగురు వ్యక్తుల పై ఏప్రిల్ 30 వ తేదీన పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో 5 గురు ముద్దాయిలను దర్యాప్తు అధికారి నూజివీడు డిఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. బాలికను తీసుకువెళ్ళడానికి ఉపయోగించిన మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

విశాలాంధ్ర రాము మృతి సిపిఐకి తీరని లోటు

విశాలాంధ్ర-ఏలూరు: కమ్యూనిస్టు కార్యకర్త, శతాధిక వృద్ధుడు విశాలాంధ్ర రాముగా పిలిచే తాన్న రామారావు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తాన్న రామారావు ఊహ తెలిసినప్పటినుండి కమ్యూనిస్టు రాజకీయాలలో మమేకమై పనిచేశారని తెలిపారు. పేద ప్రజలు, కష్టజీవుల కోసం సిపిఐ ఏ ఉద్యమం నడిపినా ఆ ఉద్యమంలో భాగస్వామిగా ఉండేవారని కొనియాడారు. 30 సంవత్సరాలు సుదీర్ఘకాలం విశాలాంధ్రను నిరాటంకంగా ఏజెంట్ గా, పేపరు పంపిణీ చేసే వారని, ఈ కారణం చేత ఆయన విశాలాంధ్ర రాముగా పిలవబడే వారని తెలిపారు. వృద్ధాప్యం కారణంగా హైదరాబాదులో వైద్య సహాయం కోసం తన నివాసాన్ని మార్చారన్నారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్ ఆశ్రమంలో భార్యతో కలిసి ఉన్నారని తెలిపారు. గత సంవత్సరం ఫౌండేషన్ నుంచి వచ్చి ఏలూరులో నివాసం ఉంటూ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందటం విచారకరం అన్నారు. వందేళ్ల ఆయన జీవితం నిబద్ధత, నిజాయితీతో సాగిందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిపిఐ కార్యాలయ కార్యదర్శిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. నమ్మిన సిద్ధాంతానికి, ఆదర్శానికి కట్టుబడి నిరాడంబరంగా తుది శ్వాస వరకు కమ్యూనిస్టు కార్యకర్తగా ఉన్నారని తెలిపారు. విశాలాంధ్ర రాము మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు.

దేవాదాయ శాఖ ఉద్యోగి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల గ్రామంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ వాసా నగేష్ ఇంట్లో అవినీతి నిరోధకశాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం నగేష్ విజయవాడ కనకదుర్గ ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ద్వారకాతిరుమల దేవస్థానంలో సదరు ఉద్యోగి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం విజయవాడలో ఇదే పంథాలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. నగేష్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడని సమాచారం రావడంతో అధికారులు బుధవారం ఉదయమే ఆయనకు సంబంధించిన నాలుగుచోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల గ్రామంలోని ఆయన సొంత అపార్ట్మెంట్‌తో పాటు విజయవాడ, భీమవరం, నిడదవోలులలో అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ద్వారకాతిరుమల సిండికేట్‌బ్యాంక్‌లో నగేష్‌కు సంబంధించిన లాకర్‌ని తెరిపించి కొన్ని ముఖ్యపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ టి.యస్.ఆర్.కె.ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్లు సిఐ భాస్కర్ తెలిపారు.

మేడే జెండాల తొలగింపు : కార్మికుల ఆగ్రహం



విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మే డే సందర్భంగా జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం బయటి ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి),సీఐటీయూ లకు చెందిన జెండాలను ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆ జెండా కర్రలు,జెండాలు తొలగించి ప్రక్కన పడవేశారని మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ జెండా కర్రలు,జెండాలు తొలగించడానికి కారణం ఏమిటో చెప్పాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండు యూనియన్ ల కార్మికులు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు ఈ విషయమై కమిషనర్ తో ఫోన్ లో మాట్లాడగా సుమారు రెండున్నర గంటల అనంతరం కార్యాలయానికి వచ్చిన కమిషనర్ ను కార్యాలయంలోనికి వెళ్లకుండా ఆయన కారును కార్మికులు అడ్డుకున్నారు. తమ జెండా కర్రలు మళ్లీ పెట్టిస్తే ధర్నా విరమిస్తామని చెప్పడంతో అందుకు కమిషనర్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడి చెబుతానని చెప్పడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో పెట్టిన తరువాత జెండా కర్రలు తొలగించారా అంటూ ప్రశ్నించారు. కార్మికులు కమిషనర్ కారును ఎంత సేపటికీ కార్యాలయంలోని విడిచి పెట్టక పోవడంతో కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే ఎస్సై సాగర్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని కార్మికులను వారించడంతో వారు తమకు స్పష్టమైన హామీ ఇచ్చి జెండా కర్రలు పెట్టిస్తే కానీ ధర్నా విరమించమని చెప్పడంతో కమిషనర్ ను వేరే ద్వారం ద్వారా పోలీసులు కార్యాలయంలోనికి తీసుకువెళ్ళారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) గౌరవ అధ్యక్షుడు జే.వి.రమణ రాజు మీడియా తో మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పారిశుధ్య కార్మికులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కార్మికులు మేడే పండుగ నిర్వహించుకుంటారని దాన్ని ఏ అధికారి ఆక్షేపించరని, మున్సిపల్ కమిషనర్ జండా కర్రలు తొలగించడం సబబు కాదన్నారు. కమిషనర్ తొలగించిన జండా కర్రలను పెట్టించిన తరువాతే పారిశుధ్య కార్మికులు విధుల్లో పాల్గొంటారని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.కే.సుభాషిణి మీడియాతో మాట్లాడుతూ మేడే నిర్వహించుకోవడం కార్మికుల హక్కని తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను కమిషనర్ వివక్ష చూపిస్తున్నారని వారికి న్యాయంగా రావాల్సిన కొబ్బరి నూనె,సబ్బులు, బట్టలు, చెప్పులు, శానిటైజర్, గ్లౌజ్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా తొలగించిన జెండా కర్రలు తిరిగి పెట్టించాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

వామపక్షాలు, కార్మిక సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వామ పక్షాలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, ప్రైవేటీకరణ ఆపాలని వామపక్షాలు, కార్మికసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా రాస్తా రోకోలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం నగరంలో స్థానిక వసంత మహల్ సెంటర్ వద్ద కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించాయి. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి అరటి కట్ల రవి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి డివిఎస్ విడి ప్రసాద్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి పోరాడాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి అవసరమయిన ఐరన్ గనులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తే నిరుద్యోగ యువత ముఖ్యంగా ఎస్ సి, ఎస్ టి, బీసీ, మైనార్టీలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కుని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం మొండి వైఖరితో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సిద్ధపడితే రాష్ట్ర ప్రజల నుండి బిజెపి తగిన గుణపాఠం ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, కే వరప్రసాద్,ఏఐటియుసి నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే,అప్పలరాజు, బల్ల కనకదుర్గారావు,మావూరి విజయ,హకీమ్, సిపిఎం నగర కార్యదర్శి పి. కిషోర్, పీవీ రామకృష్ణ,ఏ శ్యామల రాణి, సిఐటియు నాయకులు బి సోమయ్య, కె విజయ ప్రసాద్, బి జగన్నాధ రావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గడసాల వెంకటరమణ, నూకరాజు, ఎం రాము, భద్ర, అయ్యప్ప, ఐ ఎఫ్ టు యు నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, బాలాజీ, గురుమూర్తి, ఈశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఉప్పు మురలీకృష్ణ, దండు బోయిన చంద్రశేఖర్, ఎస్ బాబు ప్రసాద్, కోసూరి చంద్రకాంతమ్మ, కొమ్మన సాంబశివరావు, డి సి ఓ సుబ్బారావు, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యకర్తలు ఆదిశేష లక్ష్మి, గోపి, అప్పారావు, శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, నీలాపు ప్రసాద్, నీలాపు నరసింహారావు, రామకృష్ణ, ఎర్రగంట రాము, నీలాపు సుజాత కుమారి, అమరావతి, పాల పెద్దిరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి త్రిమూర్తులు, సిపిఎం జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు, పువ్వాడ నారాయణరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: విశాఖఉక్కు - ఆంధ్రుల హక్కు అనే మహోద్యమంలో నిర్మించుకున్నదే విశాఖ ఉక్కని విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు ఎంతటి ఉద్యమానికైనా వెనుకాడబోమని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపులో భాగంగా ప్రకాశం చౌక్ సెంటర్‌లో బుధవారం కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ 65 మంది సిపిఐ, సిపిఎం ఎమ్మెల్యేలు, ఎంపీలు పదవీ త్యాగాలు, 32మంది ఆత్మ బలిదానాలతో విశాఖ ఉక్కు ఆవిర్భావం జరిగిందన్నారు. వందల కోట్లతో ప్రారంభమైన ఉక్కు పరిశ్రమ నేడు లక్షల కోట్ల రూపాయల విలువ చేస్తుందన్నారు. రాష్ట్రం విడిపోయాక మన రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు మాత్రమే అని ఆయన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగాలతో, వేలాదిమంది రైతుల భూములతో నిర్మించుకున్నామన్నారు. నేడు కేంద్ర బీజేపీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగిన ఆందోళనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు, సిపిఐ నాయకులు మల్లుల సీతారామ్ ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, ఎం.లక్ష్మీపతి, ఏలేటి ఆనందరావు, ఆకలి రాము,సిపిఎం నాయకులు జెఎన్వీ గోపాలన్, జె.సత్యనారాయణ, ఎం. ఆంజనేయులు, డి. త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె. క్రాంతిబాబు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు, దండు అప్పల రాజు, దుగ్గిరాల శ్రీనివాసు, వాటాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ వామపక్ష పార్టీలు ఇచ్చిన రాష్ట్ర పిలుపు భాగంగా బుధవారం తణుకులో రాస్తారోకో నిర్వహిం చారు. రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు జనసేన పార్టీ తణుకు నియోజకవర్గ నాయకులు విడివాడ రామచంద్రరావు సంఘీభావం తెలియజేశారు. రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు,ఏరియా కన్వీనర్ టి. అప్పలస్వామి, ఇరగవరం మండలం కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, బొద్దాని కృష్ణ కిషోర్, సుడగల అప్పారావు, బొద్దాని మురళీకృష్ణ,సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి పి.వి. ప్రతాప్, అడ్డగర్ల అజయ్ కుమారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి. రామకృష్ణ, కడలి రామా రావు, కోరిపల్లి సత్యనారాయణ తదితరులను తణుకు టౌన్ పోలీసులు అరెస్టు చేసి సుమారు 3గంటల పాటు స్టేషన్ లో నిర్బంధించారు. విడుదల అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైయివేటీకరణను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులపర్తి సత్యనారా యణ, కట్టుంగ శంకర్, గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, కొమ్మొత్తుల రవికుమార్, గిద్దా అన్నపూర్ణ, మందుల ముత్తయ్య, బొడపాటి నారాయుడు, పతివాడ రాంబాబు, పెనుమర్తి సత్య నారాయణ రాజు, వంకాయల సత్యనారాయణ, పత్తివాడ రాంబాబు, బోడపాటి నారాయణ,పార్టీ శ్రేణులు, పార్టీ కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉండిలో : 32 మంది ఆత్మబలిదానాలు,22వేల ఎకరాల భూములనిచ్చిన రైతుల త్యాగాలు,65 మంది సీపీఐ, సీపీఎం ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీ త్యాగాల ఫలితంగా ఆవిర్భవించిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడం అత్యంత దురదృష్ట కరమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరుతూ బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉండి మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నుద్దేశించి భీమారావు మాట్లాడుతూ దేశానికి కాపలాదారుగా వుంటానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ దేశసంపదగా వున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. లక్ష మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ 4 లక్షల కోట్ల రూపాయల విలువైన విశాఖ ఉక్కు కేవలం 30 వేలకోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజల తలమానికం విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న పోరాటంలో రాష్ట్రంలో అన్ని పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. సీపీఐ నాయకులు పూసపాటి వెంకట్రామరాజు,ససపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, తమరాని శ్రీనివాస్,ఏఐటీయూసీ నాయకులు పున్నాని అప్పారావు, మంతెన కృష్ణ, ఒంటెద్దు వెంకన్న, గొర్ల వెంకన్న, కోటిపల్లి అచ్చిరాజు, యడ్ల నాగేశ్వరరావు, కలిశెట్టి శ్రీను తదితరులు నాయకత్వం వహించారు.

చింతలపూడిలో: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా చింతలపూడి పట్టణంలో ఏఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో బోసు బొమ్మ సెంటర్లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ 32 మంది విద్యార్థులు, యువకుల బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం అదానికి అమ్మకానికి పెట్టిందని దీనిని వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు కార్మికులు కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటం 800 రోజులు పూర్తయ్యిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. తక్షణం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవినేని రమేష్, నాగు, నక్క తిరుపతిరావు రాజు, బోయిన వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసి తెలుగుప్రజల మనోభావాలతో ఆడుకోవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.విశాఖఉక్కు పరిరక్షణ ఐక్యవేదిక పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో భాగంగా బుధవారం ఏఐటీయూసీ ఏరియా కమిటీ, సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఓవర్ బ్రిడ్జి సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించి , ధర్నా చేశారు. జోరునవర్షం కురుస్తున్నా వివిధ కార్మిక సంఘాల కార్యకర్తలు పెద్దసంఖ్యలో నిరసనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డి.సోమసుందర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు.విశాఖఉక్కు పరిరక్షణ అంశాన్ని ఎన్నికల ప్రణాళికలో చేర్చి , కేంద్రంపై పోరాడేపార్టీకే ప్రజల మద్దతు ఉంటుందని సోమసుందర్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో దీన్ని ఒక అంశంగా ముందుకు తెస్తామని అన్నారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ , వందల కోట్లరూపాయలు పన్నుల ఆదాయాన్ని సమకూరుస్తున్న విశాఖఉక్కును ప్రైవేటుపరం చేస్తామనడం దుర్మార్గమని అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖఉక్కు ప్రైవేటీకరణ కుట్రను తెలుగుప్రజలు సహించరని, ప్రాణ త్యాగాలతో సాధించిన విశాఖ ఉక్కును కాపాడుకుంటారని స్పష్టం చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం విశాఖ కార్మికవర్గం సాగిస్తున్న పోరాటానికి వామపక్షాలు పూర్తి అండగా నిలుస్తాయని , రానున్న రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఏరియా భవననిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కార్మికుల పోరాటానికి భవననిర్మాణ కార్మికులు కూడా మద్దతుగా నిలుస్తారని తెలిపారు. నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, తాడికొండ శ్రీనివాసరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారా యణ, కే. కృష్ణంరాజు, నాగేంద్ర, తాడేపల్లి వెంకటేష్, మాదాసు సత్యనారాయణ, చంద్రశేఖర్, కే.ముత్యం, కాటమరాజు, యు.నాగరాజు, మండేల్లి రామకృష్ణ, ఎ.కుమారస్వామి, పండు, అంజి, కే.శ్రీను, శివశంకర్, సీపీఐ నాయకులు కళింగ లక్ష్మణరావు, మండల నాగేశ్వరరావు, తాడికొండ గంగాభవాని తదితరులు నాయకత్వం వహించారు.

వేలేరుపాడులో: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం వేలేరుపాడు ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. సిపిఐ, సిపిఎం, టిడిపి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా,కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారమైన నిర్ణయాలతో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ప్రభుత్వం నిర్ణయం మారకుంటే పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండి మునీర్, బాడిస రాము, సన్నేపల్లి సాయిబాబు, ఎర్ర మధు, కారం బోజ్జి, కురిమేళ్ళ వెంకటేశ్వర్లు, గోపాలరావు, నాగేశ్వరరావు, చంద్రరావు, సిపిఎం నుండి దర్శుల రమేష్, మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, టిడిపి నుండి అమరవరపు అశోక్, శాఖమూరి సంజీవులు, కొమ్మన వెంకటేశ్వర్లు, కురిమెళ్ళ సుధాకర్, సిపిఐ ఎంఎల్ ప్రజాపందా నుండి సిరికొండ రామారావు, ఆశి లక్ష్మయ్య, చిచ్చడి రామారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

కుక్కునూరులో: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, పోరాటాల ఫలితంగా సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నష్టాల సాకు చూపి కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసే కుటిల ప్రయత్నాలను సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగాలంటూ రెండు ఏళ్లకు పైగా విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా అఖిలపక్ష రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపుమేరకు బుధవారం పెదరావి గూడెం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కుక్కునూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో మంగళవారం నుండి వామపక్ష నాయకులకు నోటీసులు ఇచ్చి నిరసన కార్యక్రమాలకు వెళ్ళవద్దని హెచ్చరించి వెళ్లారు. మరి కొంతమందిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు ప్రజాసంఘాలు కలిసి కేంద్ర ప్రభుత్వంపై మోడీ విధానాలపై ఉమ్మడి పోరు సాగించాలని పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పల్లెల బిక్షం, సోడె నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో : వామపక్షాలైన సిపిఐ సిపిఎం, కార్మిక సంఘాలు ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని లేకపోతే ప్రత్యక్ష ఉద్యమాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింప చేస్తామన్నారు. రాబోవు కాలంలో అన్ని రాజకీయ పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు కలిసి వచ్చే లౌకిక శక్తులతో భవిష్యత్తులో విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ హయాంలో అదాని, అంబానీ వంటి కొంతమంది పెట్టుబడిదారుల ఆస్తులు గణనీయంగా పెరిగాయని ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు నిండా మునిగిపోతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ రాయింకుల లక్ష్మణరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ ఆర్ హనుమాన్లు , రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠా యూనియన్ యూనియన్ నాయకులు కే రామ్మూర్తి,బోను చంద్ర రావు,చొక్కకుల శ్రీనివాసరావు, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, శోభనాద్రి, రాంబాబు, మనోహర్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో :విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణరాజు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక బైపాస్ రోడ్డులో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ రాజు మాట్లాడుతూ ఎంతో మంది కార్మికులు ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని,అందుకోసం ఎంత వరకైనా వెళ్తామన్నారు.సీపీఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంబానీ,ఆదానీలకు దేశాన్ని దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సీఐ బాల సురేష్ బాబు,ఎస్ ఐ సాగర్ బాబు రాస్తా రోకో చేస్తున్న బైపాస్ రోడ్డు కు చేరుకుని వామ పక్షాల నాయకులతో మాట్లాడి రోడ్డు క్లియర్ ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యులు సుంకర రాధా కృష్ణ,చిలంతరాజుల శ్రీను,జగన్నాథ లక్ష్మణ్, గాంధీ, సాయం శ్రీను, హనుమంతు,సీపీఎం పట్టణ కార్యదర్శి సూర్యారావు, చల్లారి మాణిక్యాలరావు, ఎస్.కే.సుభాషిణి, బొద్దు రాంబాబు, ఆందుగుల ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో: వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థ గా కొనసాగించాలని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కి సొంత గనులు కేటాయించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేసారు. ఈ రాస్తారోకోను ఉద్దేశించి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు, సిపిఎం పెంటపాడు మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రంలో 32 మంది తెలుగువారి బలిదానంతో వేలాదిమంది విద్యార్థులు, యువ జనులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనతో 1966లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఐదు కోట్ల పెట్టుబడితో ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, సత్తి కోదండరాంరెడ్డి, బందారు శ్రీనివాస్, వంక అప్పారావు, పెనగంటి దుర్గా కరక వెంకట్రావు గాది వెంకట్రావు మీసాల శ్రీను కొత్తల పండు కవల గంగరాజు తాడి గోవిందు పిట్ట రాంబాబు కోనతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కామవరపు కోటలో : కామవరపు కోట చౌత్రా సెంటర్లో సిపిఐ, ఏఐటియుసిల ఆధ్వర్యంలో ధర్నా జరిపారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు టీవీఎస్ రాజు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని విమర్శించారు. రాబోయే కాలంలో వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులు కూటమిగా ఏర్పడి ప్రజా సమూహాన్ని చైతన్యపరచి నరేంద్ర మోడీని తరిమి కొట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సభ్యులు చలమల శ్రీనివాసరావు, ఎం దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు కోతాటి వెంకటేశ్వరరావు, నల్లమోతుల అప్పన్న, కానూరు యేసు తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో

నరసాపురంలో

భీమవరంలో

తణుకులో

చింతలపూడిలో

తాడేపల్లిగూడెంలో

వేలేరుపాడులో

నూజివీడులో

కుక్కునూరులో

జంగారెడ్డిగూడెంలో

పెంటపాడులో

నేడు చంద్రబాబు ఉంగుటూరు రాక

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం ఉంగుటూరు టోల్గేట్ వద్దకు గురువారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నట్లు ఏలూరు జిల్లా టీడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు బుధవారం తెలిపారు. అకాల వర్షం వలన తడిసిన ధాన్యాన్ని పరిశీలించడానికి గురువారం ఉదయం 10 గంటలకు ఉంగుటూరు టోల్ గేట్ దగ్గరలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో చంద్రబాబు మాట్లాడతారని గన్ని తెలిపారు.

స్తంభించిన డ్రైన్లు, ముంచెత్తుతున్న వీధులు

విశాలాంధ్ర-ముదినేపల్లి : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ముదినేపల్లిలో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ముఖ్యంగా డ్రైన్లు పూడుకుపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీస్ స్టేషన్ బజారులో రహదారికి ఇరువైపులా డ్రైన్ పూడుకుపోయింది. ఈ రహదారి రామాలయం వరకు జలమయమయ్యింది. ప్రధాన రహదారి బస్టాండ్ నుండి పెట్రోల్ బంక్ వరకు, అంబేద్కర్ నగర్ కాలనీ పలువీధులు, ఆటోనగర్, చిగురుకోట సెంటర్‌లో, నరసన్నపాలెం ప్రధాన వీధులలో మురుగు డ్రైన్లు పొంగి వర్షంనీటితో కలసి రహదారులు దుర్గంధం వ్యాపిస్తున్నది. కొద్దిపాటి వర్షాలకే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవ దంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొన్నిచోట్ల డ్రైన్లు ఆధునీకరించకపోవడం, పనులు సంపూర్తిగా చేయక పోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా తగుచర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉప్పాకపాడులో బడిబాట

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఉప్పాకపాడులో బుధవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను బడిలో చేర్చాలని తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 9 మంది పిల్లలను బడిలో చేర్చుకున్నామన్నారు. అల్లు శ్రీను తల్లిదండ్రులతో మాట్లాడుతూ గుణాత్మక విద్య,ఇంగ్లీషు మీడియం, ఇంగ్లీషు లాబ్ ,జగనన్న కానుకలు,ఉచిత పాఠ్యపుస్తకాలు, రుచికరమైన గోరుముద్ద, నాడు నేడు తో ఆకర్షణీయమైన వాతావరణం, సకల సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాల లో ఉన్నాయి మీ పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ వంబరిల్లి రామకృష్ణ ,ఉపాధ్యాయులు పి.శ్రీదేవి పాఠశాల ఆయ షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ఆంధ్ర ప్రదేశ్ ఖాధి గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. విజయ కుమార్ తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ కేంద్రంను బుధవారం ఆయన సందర్శించి లబ్ది దారులకు పిఎంఈజిపి పథకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టుమిషన్ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ఉచితంగా యంత్రపరికరాలు అందజేస్తామని ఆయన తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలంపాటి హరిబాబు, గడా శ్రీధర్, పాపోలు చంద్రశేఖర్,శిరిమళ్ళ నాగార్జున, మక్కిన శ్యామసుందరరావు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర -కైకలూరు : కైకలూరులో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం సుదర్శన హెూమంలో ఎమెల్యే దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఆలయ అర్చకులు, ధర్మ కర్తమండలి పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. మీసాల వెంక టేశ్వరస్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలనంతరం స్వామి వారి సుదర్శన హెూమము ఎమ్మెల్యే దంపతులు సతీ సమేతంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజల అనంతరం హెూమాన్ని తిలకించి ఎమ్మెల్యే దంపతుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, శాసన సభ్యులు తనయులు దూలం వీర శ్యామ్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం పదిలం

విశాలాంధ్ర-మండవల్లి: భూసారాన్ని పెంపొందించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారిణి షేక్‌జరీనా అన్నారు. తొలకరి వర్షాలు ఆరంభం అయినందున రైతులు లోతు దుక్కులు చేపట్టాలని పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు. జీలుగ,పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట పైర్లను భూమిలో చల్లి పూత దశలో నేలలో కలియ దున్నటం వల్ల భూమిలో సారం పెరుగుతుందని రాబోవు పంటలు ఆశాజనకంగా పెరుగుతాయన్నారు.రైతులు సేంద్రీయసాగును ఆచరిస్తే నేల ఆరోగ్యంగా ఉండి పంటల్లో చీడపీడలు సమస్యలు తగ్గుతాయని సాగు లాభదాయకంగా ఉండి రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. పంటల ఉత్పత్తి నాణ్యంగా ఉండాలంటే ప్రతి రైతు సేంద్రీయసాగువైపు అడుగులు వేయాలని రసాయనిక సాగును విడిచిపెట్టాలన్నారు. ఆర్బికెలలో విఏఏలు రైతులకు ఉపయోగకారిగా ఉంటున్నారని పేర్కొన్నారు.

61 మంది వృద్ధులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాం క్రింద60 సంవత్సరాలు వయస్సు దాటిన వృద్ధులకు నేత్ర వైద్య అధికారి ఐ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో 61 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందరికీ కళ్ళజోళ్ళు పడినట్లు ఆయన తెలిపారు. ఈ కళ్ళజోళ్ళు ప్రభుత్వం ఉచితముగా ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా సూరి బంగారయ్య, సిహెచ్‌ఓ జె. విల్సన్ బాబు, డి.దుర్గారావు,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ హెల్త్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఏఎన్ఎం ఝాన్సీ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గన్ని

విశాలాంధ్ర-ఉంగుటూరు : కురిసిన వర్షాలకు తడిసి మొక్క వచ్చిన ధాన్యం రాశులను బుధవారం ఉంగుటూరు మండలం కాగుపాడు లో ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ తడిసి మొక్క వచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకు వెంటనే కొనాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. రైతుల భాదలు పట్టని నాయకులు మనకు అవసరమా, ఒక్క ప్రజా ప్రతినిధి కూడా రైతులను పరామర్శించిన పాపాన పోలేదు. వాళ్ళంతా జగనే మా నమ్మకం అని ఇంటింటికి స్టిక్కర్లు అంటించుకునే పనిలో బిజీ గా ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాతూరివిజయ్ కుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మణి గంగాధర్, రెడ్డి సూర్యచంద్రరవు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, కరణం పెద్దిరాజు, రైతులు పాల్గొన్నారు.

వాహనాలు బహిరంగ వేలం

విశాలాంధ్ర-టి.నరసాపురం: ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ యాక్ట్ కేసులో పట్టుబడిన వాహనాలు వేలంపాట నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఏలూరు జిల్లా ఎస్‌పి దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాలు మేరకు టి. నరసాపురం పోలీస్ స్టేషన్ నందు ఎపి ఎక్సైజ్ యాక్ట్ కేసులలో పట్టుబడిన 17మోటర్ సైకిళ్ళు ఒక కారును ఏలూరు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జీలుగుమిల్లి వారి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బహిరంగంగా వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి వున్నవారు తగిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవల సిందిగా ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

విశాలాంధ్ర -కాళ్ళ : మండలంలో ప్రథమంగా జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి ఎ. రవీంద్ర అన్నారు. జువ్వలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఈయన ప్రారంభించారు. ఇంత చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసిన బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామిని అభినందించారు. మాజీ ఉప సర్పంచ్ శ్రీ.గోకరాజు వినోద్ రంగరాజు మాట్లాడుతూ గ్రామంలో మూడు చోట్ల ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. ఎంపీటీసీ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు మిగిలిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. స్వామి మాస్టారు మాట్లాడుతూ ఈ శిబిరాలు ఉదయం 8 గంటలనుండి 10 గంటలవరకు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది

విశాలాంధ్ర-భీమవరం: రైతుల నుండి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతు మిల్లర్ల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. బుధవారం స్థానిక బివి రాజు కళాశాల అతిథి గృహంలో మంత్రి కారుమూరి పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు రైస్ మిల్లర్లకు సంబంధం లేదనే విషయం తెలియక, ఇంకా రైతులు అపోహ పడుతున్నారన్నారు. రైతు ఆర్ బి కే లో ధాన్యం అప్పగించి రసీదు పొందే వరకే రైతు బాధ్యత అని, తర్వాత మిల్లర్లు పిలిచినా వెళ్లవలసిన అవసరం లేదన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా గత సీజన్లో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ధాన్యం కొనుగోలులో ఇంకా చెల్లించా ల్సిన రూ.33కోట్లు రైతులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవి కూడా రైతు అకౌంట్లు మిస్ మ్యాచ్ వలన అకౌంట్ లో జమ కావడం లేదని వాటిని సరి చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

నూజివీడు టీడీపీలో అనూహ్య పరిణామాలు

విశాలాంధ్ర-చాట్రాయి: టిడిపి సీనియర్ నాయకులు నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు యువగళం పాదయాత్రకు వెళ్ళి వచ్చి 24గంటలు గడవకు ముందే అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు.లోకేష్ తో కాపా ప్రత్యేకంగా మాట్లాడి ఇంటికి వచ్చే లోపే సీటు కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న పర్వతనేని గంగాధర్ కు పార్టీ అధినేతను కలవాలని ఫోన్ కాల్ రావడం గంగాధర్ చంద్రబాబును కలవడం అనేక అంశాలు చంద్రబాబు సవినయంగా మాట్లాడటం అన్ని వెంట వెంటనే జరగడంతో నియోజకవర్గ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయని పలువురు అంటున్నారు. కాపా ఆశీస్సులతో గంగాధర్ కు అధినేత నుంచి పిలుపు వచ్చిందంటున్నారు. నియోజకవర్గ ఇన్ చార్జితో కాపాకు వచ్చిన విభేదాలు, కాపాకు పార్టీలో జరిగిన అన్యాయం లోకేష్‌కు పూర్తి సమాచారం తెలుసని అంటున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు తనయుడు లోకేష్ కి కాపా సుదీర్ఘ కాలంగా అత్యంత ఆత్మీయుడైన కాపా తాను చేయగలిగింది చేసుకుంటూ వెళుతున్నారు.గ్రూపులు బలా బలాలు సమీకరణాలు ఎలా వున్నా నూజివీడు చంద్రబాబు సభకు నూజివీడు లోని తన కార్యాలయంలో కాపా ఒక్కడే కూర్చుని తన అభిమానులంతా తరలి రావాలని ఒక వీడియో ద్వారా సామాజిక మాధ్యమాల్లో బాహుబలిలా పిలుపునిచ్చి సుమారు 1000కి పైగా మోటారు బైక్ లతో ర్యాలీ నిర్వహించి తను సత్తా చాటుకున్నారు.రెండోసారి లోకేష్ పాదయాత్ర కు కాపా వెళ్ళి వచ్చిన వెంటనే గంగాధర్ కు పిలుపు రావడంతో నియోజకవర్గంలో అనూహ్య మార్పులకు సంకేతం అని పలువురు అంటున్నారు.

ధాన్యం బస్తాలు మోసిన మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ

విశాలాంధ్ర-తణుకు: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తణుకు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను బుధవారం తణుకు మండలంలో రాధాకృష్ణ రైతులను పరామర్శిం చారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కొద్దిసేపు ధాన్యం బస్తాలు మోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టడానికి ప్రభుత్వం చేస్తున్న అలసత్వాన్ని ఆపాలన్నారు. చిరిగిన సంచులు ఇవ్వడం వలన రైతులు అవస్థలు పడుతున్నారన్నారు.సరైన ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఆయన వెంట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

వడదెబ్బకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్. అగ్రహారంలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలపై అవగాహన, ఓఆర్ఎస్ ద్రావణం వలన కలిగే లాభం గురించి ఆరోగ్య సహాయకుడు నామాల రాజు బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వేసవి కాలంలో ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా ఒక గ్లాస్ నీరు త్రాగాలని, గొడుగు,తెలుపు రంగు వస్త్రాలు ,తలకు టోపీ లేదా రుమాలు వాడాలని, వడ దెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ వేసవి కాలంలో ఉదయం 11 గంటల తరువాత బయటకు వెళ్ల కూడదని అత్యవసరమైతే నీరు, కాళ్లకు చెప్పులు ధరించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎం ఎల్ హెచ్ పి ఆర్ మాధురి ప్రకాష్, ఏ ఎన్ ఎం ఏసమ్మ, ఆశ కార్యకర్తలు బి. లక్ష్మి భవాని, పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాను

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : జలాలుద్దీన్ బాబా మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆప్తమిత్రుడుని కోల్పోయానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి సీనియర్ నాయకులు, ముస్లిం మైనార్టీ సంఘ పెద్ద జలాలుద్దీన్ బాబా అనారోగ్యంతో మరణించారు. బుధవారం ఆయన భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సందర్శించి కన్నీరు, మున్నీరు అయ్యారు. తమ కుటుంబంతో జలాలుద్దీన్ బాబా చిన్ననాటి నుండి కలిసిమెలిసి ఉండేవారని, కష్టసుఖాల్లో తన వెంటే అండగా ఉన్నారని, ఏనాడు కూడా పదవులను ఆశించలేదని, నిస్వార్థంగా తన కోసం, పార్టీ కోసం బాబా పని చేశారని ఆయన అన్నారు ముందుగా బాబా భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైసిపి పట్టణ కన్వీనర్ తోట భోగయ్య మాట్లాడుతూ తనకు చిన్ననాటి నుండి బాబాతో పరిచయం ఉందని, నిలువెత్తు నిజాయితీకి బాబా నిదర్శనమని, ఆయన లేని లోటు ను ఎవరూ కూడా భర్తీ చేయలేరని పేర్కొన్నారు.

గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర - లింగపాలెం : వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయ నిర్వాహకులు వెంకటరమణ, లతీఫ్ తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఈ శిబిరం దోహదపడుతుందని వీరు తెలిపారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి చదివే వారు వీటిని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. శిబిరంలో పుస్తక పఠనం, డ్రాయింగ్, ఇంగ్లీషులో మాట్లాడటం, డ్రాయింగ్, క్రాఫ్ట్, చదరంగంలాంటి వ్యక్తి వికాసానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తామని అన్నారు. నిష్ణాతులైన వారు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిబిరాన్ని ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తామని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందచేస్తామని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులు ముందుగా గ్రంథాలయాలలో పేర్ల నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

పంట నష్టం జరిగిన రైతులను పరామర్శించిన జెట్టి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : అకాల వర్షాల కారణంగా ఏలూరు జిల్లా లోని మెట్ట ప్రాంతంలోని పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునాధరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని నాగులగూడెం,పేరంపేట లో వర్షాల కారణంగా నష్ట పోయిన రైతులను పరామర్శించి,నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెట్టి గురునాధరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, మామిడి, జీడి మామిడి, మిర్చి, కూరగాయలు,ఇతర పంటలు వర్షాల కారణంగా నీటమునిగి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పిటిసి ముప్పిడి శ్రీనివాసరావు, గోలి శ్రీనివాసరెడ్డి, గోలి సీతారెడ్డి, గోలి రమణారెడ్డి, చిలకా పండు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు హీరా హకీమ్, వీరవల్లి సోమేశ్వరరావు, రొక్కం ఆదినారాయణ, తాడేపల్లి ఉమాదేవి, జీడిగంటి రామారావు, మామిడి రాము, కసింకోట సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ యజమానుల నుంచి రైతులకు రావాల్సిన డబ్బులు ఇప్పించండి

విశాలాంధ్ర - లింగపాలెం : సార్వాలో పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు రైతుల నుంచి లారీ యజమానులు డబ్బులు వసూళ్ళు చేశారని, ఈ డబ్బును ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ధర్మాజీగూడెం సహకార సంఘ పరిధిలో 20 లారీలకు రైతుల నుంచి లారీ యజమాని ఒక్కొక్క లారీకి రూ. 11 వేలు నుంచి రూ. 12 వేలు వసూలు చేశాడని, వసూలు చేసిన డబ్బులను ప్రభుత్వం నుంచి రాగానే రైతులకు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. లారీ యజమానులకు ప్రభుత్వం డబ్బు చెల్లించిన రైతులకు మాత్రం డబ్బులు ఇవ్వటంలేదని ఆరోపిస్తున్నారు. లారీ యజమాని నుంచి దాదాపు రూ. 2.30 లక్షలు రైతులకు రావాల్సి ఉందని, వీటిని చెల్లించకపోతే ఆందోళన చేస్తామని రైతులు తెలిపారు. అధికారులు జోక్యం చేసుకుని డబ్బులు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

10 నుంచి హనుమ జయంతి మహోత్సవాలు

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు యడ్ల బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం లో ఈనెల 10వ తేదీ నుండి, 14 వ తేదీ వరకు శ్రీ హనుమ జయంతి మహోత్స వాలను అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు పంచముఖ ఆంజనేయ స్వామి సేవా సమితి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. స్వామి వారికి సామూహిక సహస్రనామార్చన నిర్వహిస్తామని, ఈ పూజలు చేయించుకున్న భక్తులకు, చివరి రోజున ప్రసాదాలు, నరఘోష నివారణ యంత్రం (సర్వదోష నివారణ చక్రం తో) స్వామి వారి జెండా, వాహన రిబ్బన్ అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ప్రముఖులు

విశాలాంధ్ర-ఉండి: ఉండి మండలం పాందువ్వ గ్రామంలో పునర్నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టకు ఉండి, ఆచంట శాసనసభ్యులు మంతెన రామరాజు, చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహ రాజు, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, జనసేన పార్టీ పీఏసీ సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కరుణ కటాక్షం గ్రామంలోని అందరి పైన ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి స్థలదాత గణపవరం కాశీరాజు, నిర్మాణానికి సహకరించిన రామకృష్ణంరాజు, వేగేశ్న బంగారమ్మ, ఎంఎస్ వర్మ లను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంఎస్ వర్మ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 3000 మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగిరాజు యామినీ ప్రియాంక, మంతెన సూర్యనారాయణ రాజు, చింతలపాటి రాజేష్, మంతెన శ్రీహరి రాజు, దెందుకూరి శ్రీనివాస్ రాజు, నాయకులు కరిమెరక నాగరాజు, జుత్తిగ శ్రీనివాస్, పేరిచర్ల కృష్ణంరాజు, కిన్నెర వెంకన్న, గురుగుబిల్లి సత్యనారాయణ, మంతెన సాయి లచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈ కేవైసీ చేయించుకోండి

విశాలాంధ్ర - చాగల్లు : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, తమ సి ఎఫ్, ఎం.ఎస్ ఐడి లను ఆధార్ కు లింకు చేసిన మొబైల్ నెంబర్లు అనుసంధానం చేయవలసి ఉందని నిడదవోలు సబ్ ట్రెజరీ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 4, 5 వ తేదీలలో చాగల్లు మండల పరిషత్ కార్యాలయం నందు ఈ కేవైసీ చేయుదురు. కావున ఇప్పటివరకు ఎవరైతే ఇంకనూ పెన్షన్కు ఆధార్ నెంబర్‌తో లింకు చేసుకొనలేదో వారందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నిడదవోలు సబ్ ట్రెజరీ అధికారి కోరారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం సబ్ స్టేషన్ సమీపంలో యానం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఐదు ఫుల్ మద్యం బాటిల్లు, 8 బీర్లు స్వాధీనం చేసుకుని, కారు సీజ్ చేసినట్లు ఎస్సై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలపై అవగాహన అవశ్యం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: వైయస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా 60 ఏళ్ళు పైబడిన వారికి ఇంటివద్దకు వైద్యం అందించే జెరియాట్రిక్ హెల్త్ కేర్ సర్వీసులు పట్ల అందరికి అవగాహన కల్పించాలని సచివలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్ తెలిపారు. బుధవారం కొయ్యలగూడెం మండలం సీతంపేట గ్రామ సచివాలయం, గ్రామ వైయస్సార్ హెల్త్ క్లినిక్,గ్రామలో రెండు అంగన్వాడీ కేంద్రాలు సందర్శించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధించటానికి అవగాహన కోసం ఆయా ప్రదేశాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్ ధరలను ప్రకటించిన టయోటా కిర్లోస్కర్ మోటర్

విశాలాంధ్ర-భీమవరం: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) నేడు తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్ మరియు వీఎక్స్) ధరలను వెల్లడించింది. టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ ఈ వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసియా కలిగి ఉంటుందనీ, దీనిని కఠినమైన ధృడమైన ప్రదర్శన కోసం నిర్దిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్ అవసరాలు తీరుస్తుందని, ఎక్స్ షోరూమ్ ధరలు దేశవ్యాప్తంగా అన్ని గ్రేడ్‌లకూ వర్తిస్తాయన్నారు. ప్రీమియం కలర్స్‌కు అదనపు ధరలు వర్తిస్తాయని, తమ విభాగంలో ఈ ప్రతిష్టాత్మక ఎంపీవీ అగ్రగామిగా 2005లో మార్కెట్‌లో విడుదలైన నాటి నుంచి నిలువడంతో పాటుగా ఇప్పటి వరకూ ఒక మిలియన్‌కు పైగా యూనిట్లు విక్రయించబడ్డాయని చెప్పారు.

బేతాళ వీరాస్వామి జన్మదినం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం, యర్నగూడెం గ్రామంలో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు బేతాళ వీరాస్వామి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ ప్రజలు, సంస్థ నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న పలువురు మహిళలు కేక్ కట్ చేసి, బి.వి. స్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పార్డ్ ఇండియా పలు శుభ సందర్భాలను పురస్కరించుకుని గత కొన్నేళ్లుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. తన జన్మదిన సందర్భంగా బి.వి.స్వామి ఆన్ లైన్ ద్వారా ఒక సందేశమిస్తూ, తమ సంస్థ భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేపట్టి, ప్రజలకు సాయ పడుతుందని తెలిపారు. నేటి కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సోమిశెట్టి వెంకట్రావు, దుర్గా భవానీ, కిరణ్ ప్రభృతులు పాల్గొని ప్రసంగించారు. సంస్థ కార్యనిర్వాహక వర్గం బి.వి.స్వామి కి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియ చేస్తూ, అభినందించింది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కొత్తపేట : తడిసిన ధాన్యం విషయంలో కొనుగోళ్ళను ప్రభుత్వం వేగవంతం చేయాలని రాష్ట్ర టిడిపి ఉప అధ్యక్షుడు బండారు సత్యానందరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలు కారణంగా జరిగిన పంట నష్టం వలన రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. 5 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలపై ముందస్తు సమాచారం, తగు ఏర్పాట్లు ప్రభుత్వం చేయకపోవడంతో రైతులు ఎక్కువగా నష్టపోయారు. ఏప్రిల్ 23 నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. కళ్లాల్లో ఆరబోసిన పంట దెబ్బతింది. రైతులకు గోనె సంచులు కూడా సరఫరా చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది. మరోవైపు పండించిన పంటలకు మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

రైతులను ఆదుకోవాలి : నష్టపోయిన వరి రైతుకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం అందజేయాలి. అకాల వర్షాలకు దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. రైతులకు తగినన్ని నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలని కోరుతున్నాం.

ఇటుకల కొరత లేకుండా దృష్టి పెట్టండి

విశాలాంధ్ర - కాకినాడ : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహనిర్మాణాలకు ఇటుకల కొరత లేకుండా డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా ఉండేలా కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కొమరగిరి, పండూరు, ఏపీత్రయం లే అవుట్లలో గృహనిర్మాణ ప్రగతిపై హౌసింగ్, మెప్మా, నగరపాలక సంస్థ, ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఒక్క కొమరగిరి లేఅవుట్‌లోనే సుమారు 5500 గృహాలు గ్రౌండ్ అయ్యి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. అక్కడ నిర్మాణాలకు, అవసరమైన ఇటుకల సరఫరాలో కొరత కనిపిస్తోందన్నారు. అందువల్ల అక్కడ నిర్మాణాలు చేస్తోన్న ప్రతీ కాంట్రాక్టర్ సొంతంగా ఇటుకలబట్టీ పరిశ్రమను సమకూర్చుకోవాలని, ఇందుకు లేఅవుట్ ప్రాంగణంలో అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశాల మేరకు గృహనిర్మాణ ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, హౌసింగ్ ఈఈ గుప్త, డిఈ సత్యనారాయణరెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి

విశాలాంధ్ర - శంఖవరం : మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని శంఖవరం మండల వ్యవసాయ శాఖాధికారి పి. గాంధీ సూచించారు. శంఖవరం, కొంతంగిలో రైతులతో వరి పంటను పరిశీలించి సూచనలు ఇచ్చారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి రైతులు వరి కోతలు వాయిదా వేయాలని, పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, వాలిన పంటను నిల దొక్కెలా చేయాలని తెలిపారు. కోసిన పనలను గట్లపై వేసి అటు ఇటు తిరగేసి 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి అని వివరించారు. నూర్చిన ధాన్యం మొలక రాకుండా క్వింటా ధాన్యంలో కిలో ఉప్పు మరియు 20కిలోల పొడి ఊక కలపడం వల్ల రంగు మారకుండా, చెడు వాసన రాకుండా నివారించవచ్చు అని వివరించారు. ఏఓ వెంట వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వికాస్, బిందు, రైతులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో ఆరుగొలను

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు బుధవారం కురిసిన భారీ వర్షంతో ఆరుగులను గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సుమారు రెండు గంటలపాటు ఏకథాటిగా కురిసిన భారీ వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు బయటకు వెళ్లే అవుట్ లెట్స్ పూడికు పోవడం వల్ల, గత పంచాయతీ పాలకులు చేసిన తప్పిదం వలన ముంపు బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి కావలసిన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని,గతంలో కచ్చా డ్రైన్లు తీసినప్పుడు కూలీలకు ఇవ్వాల్సిన సొమ్ములు ఇంకా ఇవ్వలేదని గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 5 వేలకు పైబడి ఉన్న ఈ ఆరుగులను పంచాయతీ జనాభా ఈ డ్రైనేజీ వ్యవస్థ పట్ల అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన అందుకు స్పందిస్తూ డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన సరిదిద్దాలని అవసరమైతే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా తొలగించి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి చంద్ర రాజును ఎండిఓ వేణుగోపాల్‌ను ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ బుచ్చిబాబు వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే మురుగునీరు నిల్వ ఉండి తాగు నీటిలో పైపులైన్ ద్వారా కలిసే అవకాశం ఉందని అన్నారు దీనివల్ల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు ప్రభుత్వం స్పందించి నిధులు ఏర్పాటు చేసి డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించాలని సర్పంచ్ బుచ్చిబాబు కోరారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

విశాలాంధ్ర- పెనుమంట్ర: ధాన్యం కొనుగోలు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నా ఇవేమీ మాకు పట్టవు అంటూ పెనుమంట్ర మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది వ్యవహరిస్తున్నారు. నెలమూరు, ఓదూరు, ఆలమూరు, సత్యవరం, మల్లిపూడి గ్రామాల్లో రైతన్నలకు రైతు భరోసా కేంద్రాల వద్ద గోనె సంచులు అందుబాటులో లేకపోవడం,సిబ్బంది రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో రైతు కంట కన్నీరే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.